సాక్షి అనకాపల్లి

బుధవారం । 17 । జూలై । 2024



హ్యాండ్లూమ్ సారీ వాక్

విశాఖ: వచ్చే నెల నిర్వహించనున్న 'హ్యాండ్లూమ్ సారీ వాక్'పై విద్యార్థినులకు మంగళవారం అవగాహన కల్పించారు.

inspire awards - manak

విద్యార్థుల భవితకు భరోసా

ఇన్‌స్పైర్ మనాక్ పోటీలు విద్యార్థుల మేధో శక్తికి ప్రోత్సాహమందిస్తాయి. ప్రతిభ నిరూపించుకుంటే వారి భవిత బంగారమే. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
32.3/25.0

వాతావరణం

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

మళ్లీ 'కనెక్షన్' దందా!

ఐదేళ్ల క్రితం సబ్బవరంలో ఓ రైతు వ్యవసాయ కనెక్షన్ కావాలంటూ దరఖాస్తు చేసుకున్నారు. వెంటనే ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది ఆ రైతు దగ్గరికి వచ్చి.. రూ.50 వేలు ఇస్తే.. కనెక్షన్ వచ్చేస్తుందని చెప్పడంతో.. నమ్మిన రైతు వెంటనే రూ.50 వేలు అందజేశారు. కానీ కనెక్షన్ రాకపోవడంతో సదరు ఈపీడీసీఎల్ సిబ్బందిని నిలదీశారు. రూల్స్ మారిపోయాయి.. ఇంకో రూ.లక్ష అవుతుందని లైన్‌మెన్, ఏఈ చెప్పడంతో కంగుతిన్న ఆ రైతు వెంటనే ఉన్నతాధికారికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయాలని డీఈ స్థాయి అధికారిని ఆదేశించగా.. డీఈ.. ఏఈకి అప్పగించారు. ఇలా.. చుట్టూ తిరిగి వారి దగ్గరికే ఫైల్ రావడంతో తమపైనే ఫిర్యాదు చేస్తారా అంటూ.. కనెక్షన్ కావాలంటే రూ.4 లక్షలు అవుతుందని అంచనా వేయడంతో రైతు ఆందోళనకు గురయ్యారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో సదరు రైతు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. కేవలం వారం రోజుల్లోనే కనెక్షన్ వచ్చేసింది. దీంతో రైతు సంబరంతో వ్యవసాయం చేసుకుంటున్నారు.

ఇప్పుడు మళ్లీ పాత రోజులు రానున్నాయి. కనెక్షన్ కోసం కానులు సమర్పించే టీడీపీ మార్కు పాలసీ వచ్చేసింది. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే చెల్లవంటూ ఈపీడీసీఎల్ స్పష్టం చేయడంతో రైతులంతా ఆందోళన చెందుతున్నారు.

- వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు కొత్త రూల్
- గత ప్రభుత్వ హయాంలో సచివాలయాల్లోనే దరఖాస్తు
- ఈ విధానానికి స్వస్తి చెప్పిన కూటమి ప్రభుత్వం
- ఇకపై 1912కి కాల్ చేసిన తర్వాత రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- అధికార పార్టీ నేతలతో కలిసి చేతివాటం ప్రదర్శించనున్న ఈపీడీసీఎల్ సిబ్బంది



వ్యవసాయ విద్యుత్ కనెక్షన్

సాక్షి, విశాఖపట్నం :

గతంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కావాలంటే.. స్థానిక టీడీపీ నేతలకు ముందుగా దరఖాస్తు చేసుకునే వారు. వారికి కొంత సమర్పించిన తర్వాత.. విద్యుత్‌శాఖ అధికారులకు ముడుపులు చెల్లించేవారు. వారు ఎప్పుడు కరుణిస్తే.. అప్పుడు విద్యుత్ కనెక్షన్ వచ్చేది. ఈ బాధల నుంచి గట్టెక్కించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయాల్లో పూర్తి డాక్యుమెంట్స్‌తో కలిపి దరఖాస్తు చేసే వ్యవస్థను అమలు చేయడంతో రైతులు ఖుషీగా ఉండేవారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏ సమస్యకైనా దాని తీవ్రత బట్టి వారం నుంచి 10 రోజుల్లోనే పరిష్కారం లభించేది. ఇకపై ఆ సంతోషం రైతు ముఖాల్లో కనిపించకూడదనే ఉద్దేశంతో టీడీపీ కూటమి ప్రభుత్వం మళ్లీ తమ చుట్టూ తిరగాల్సిందేనన్నట్లుగా నూతన విధానం అమలు చేస్తున్నారు.

1912కి కాల్ చేయాలంట?

ఇకపై కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కావాలంటే ఈపీడీసీఎల్ టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయ్యాల్సిందేనని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. మీ-సేవా కేంద్రాలు, గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియకు స్వస్తి చెబుతున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. సచివాలయాల్లో కొత్త వ్యవసాయ కనెక్షన్ల నమోదు సమయంలో పత్రాలను అప్‌లోడ్ చేసే సమయంలో ఇబ్బందులు వస్తున్నాయనీ.. అందుకే ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కానీ అసలు విషయంలో మాత్రం ఇంకో కోణం ఉంది. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం 1912కి కాల్ చేసి రైతులు తమ వివరాలు చెప్పిన వెంటనే.. విద్యుత్ శాఖ సిబ్బంది ఆ వివరాలను ఆ ప్రాంత అధికార పార్టీకి చెందిన నేతలకు అందజేస్తారు. కనెక్షన్ కావాలంటే.. ఒక రేటు ఫిక్స్ చేస్తారు. ఆ రేటుకు రైతు ఓకే చెబితే తప్ప.. కొత్త కనెక్షన్ వచ్చే ప్రసక్తే ఉండబోదన్నది వాస్తవం. ఇలా రైతుల నడ్డివిరిచి అధికార పార్టీ నేతలు తమ జేబులు నింపేసుకునేందుకు ఈ విధానాన్ని విద్యుత్‌శాఖపై ఒత్తిడి తీసుకొచ్చి మరీ అమలు చేస్తున్నారని తెలుస్తోంది. అంటే ఇకపై అన్నదాతకు విద్యుత్ కనెక్షన్ కావాలంటే గతంలో మాదిరిగానే టీడీపీ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేసే రోజులు ఆరంభమయ్యాయని వారంతా ఆందోళన చెందుతున్నారు. అధికార పార్టీ అడుగులకు మడుగులొత్తేలా ఈపీడీసీఎల్ అధికారులు తీసుకొచ్చిన ఈ విధానంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా పెద్దేరు జలాశయం



ప్రధాన గేటు ద్వారా వరద నీరు విడుదల చేస్తున్న దృశ్యం

మాడుగుల: అత్యంత జలవనరులు గల పెద్దేరు జలాశయం నీటిమట్టం మంగళవారం ప్రమాద స్థాయికి చేరుకుంది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 137 మీటర్లు కాగా, మంగళవారం నాటికి 136.25 మీటర్లకు పెరిగింది. జలాశయం పరిసరాల్లో 10 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. దీంతో జలాశయం అధికారులు అప్రమత్తమయ్యారు. వర్షాలకు 300 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో అంతే వరద నీరు ప్రధాన గేటు ద్వారా విడుదల చేస్తున్నారు. దీంతో పెద్దేరు ఏటి బాధిత జంపెన, వీరవిల్లి, పోతనపూడి, వీరనారాయణం గ్రామాలకు చెందిన రైతులు అప్రమత్తంగా ఉండాలని జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు.

ఎస్పీ మురళీకృష్ణకు ఘనంగా వీడ్కోలు



ఎస్పీ మురళీకృష్ణను సత్కరిస్తున్న పోలీస్ అధికారులు

అరిలోవ (విశాఖ): బదిలీపై వెళుతున్న అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణను పోలీస్ అధికారులు ఘనంగా సత్కరించారు. ఇటీవల జరిగిన పోలీస్ అధికారుల సాధారణ బదిలీల్లో ఆయనను అనంతపురం జిల్లా ఎస్పీగా నియమించారు. దీంతో కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో మంగళవారం అనకాపల్లి జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు. అనంతరం ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ నాటుసారా, గంజాయి రవాణాలను అరికట్టి, శాంతి భద్రతలను పరిరక్షించడంలో జిల్లా పోలీసులు ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ఇటీవల సాధారణ ఎన్నికల్లో బందోబస్తు విధులను సమర్థంగా నిర్వహించారని ప్రశంసించారు. ఏఆర్ సిబ్బంది జిల్లా పోలీస్ శాఖకు వెన్నెముకగా నిలిచారన్నారు. తాను విజయవంతంగా విధులు నిర్వహించడానికి అందరూ సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, ఎస్బీ డీఎస్పీ బి.అప్పారావు, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, అప్పలనాయుడు, కుమారస్వామి, మన్మధరావు, సతీష్, నర్సింహమూర్తి, సంజీవిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

హెల్మెట్ వాడకంపై వన్-కె వాక్ రేపు



జిల్లా ప్రధాన న్యాయమూర్తి

విశాఖ లీగల్ : ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తూ ఈనెల 18న వన్-కె వాక్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జరిగే కార్యక్రమంలో భాగంగా ఆ రోజు ఉదయం 6.30 గంటల నుంచి ఆర్కే బీచ్ కాళీమాత ఆలయం నుంచి పోలీస్ మెస్ వరకు ప్రజా ర్యాలీ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, న్యాయవాదులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

19న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు రాక

మహారాణిపేట (విశాఖ): జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ ఈ నెల 19న విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో శుక్రవారం ఉదయం 7 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. ఇక్కడ నుంచి పాడేరు బయలుదేరుతారు. ఆదివాసీ ఉద్యోగ భవనంలో గిరిజనులతో సమావేశమవుతారు. 11 గంటలకు పాడేరు ఐటీడీఏ మీటింగ్ హాలులో కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులతో సమావేశం అవుతారు. 2 గంటలకు అరకు చేరుకుని అక్కడ పలు ప్రాంతాలను సందర్శిస్తారు. సాయంత్రం 5 గంటలకు ఏపీ టూరిజం అభివృద్ధి కార్పొరేషన్, రెవెన్యూ అధికారులతో హరిత హోటల్‌లో సమావేశమవుతారు. రాత్రికి విశాఖ చేరుకుని బస చేస్తారు. 20న ఉదయం 11 గంటలకు విశాఖ పోర్టు ట్రస్ట్‌లో ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్, మధ్యాహ్నం 2 గంటలకు స్టీల్‌ప్లాంట్ ఎస్టీ ఉద్యోగులు అసోసియేషన్, సాయంత్రం 5 గంటలకు గిరిజన నాయకులతో సమావేశం నిర్వహిస్తారు. రాత్రి 8.45 గంటలకు విమానంలో హైదరాబాద్ వెళతారు.

తైక్వాండో పోటీల్లో పతకాల పంట



జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

యలమంచిలి : జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో యలమంచిలి క్రీడాకారులు ప్రతిభ కనబరిచారని తైక్వాండో అసోసియేషన్ వ్యవస్థాపకుడు నగిరెడ్డి సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12 నుంచి 14 వరకు హైదరాబాద్‌లో కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో జరిగిన వెట్రన్స్ ఇండియా జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో యలమంచిలికి చెందిన 13 మంది క్రీడాకారులు పాల్గొనగా వారిలో ఆరుగురు క్రీడాకారులు బంగారు పతకాలు, సాధించగా నలుగురు క్రీడాకారులు రజత పతకాలు, ఒకరు కాంస్య పతకం సాధించారని తెలిపారు. వారిలో ఎం.కుందనప్రజ్ఞ, పి.సుస్మిత, దీక్షిత, లహరి, సింహాద్రి, శ్రీవృశాగ్ బంగారు పతకాలు, ఎస్.శ్రీఇషిత, పోలవరపు దేవి, వుడా నందకృష్ణ, జి.విష్ణు, రజత పతకాలు పతకాలు, బి.భవానీ కాంస్య పతకం పొందారు. ఈ పోటీలకు ఆంధ్రా టీం కోచ్‌లుగా శిక్షణనిచ్చిన డి.జ్ఞానేశ్వర్‌రావు, గోపీనాయుడును, క్రీడాకారులను వారి తల్లిదండ్రులు, సత్య టైక్వాండో ఆకాడమీ ప్రతినిధులు, సీనియర్ టైక్వాండో క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

19న జాబ్‌మేళా



కంచరపాలెం (విశాఖ): కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 19న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. ఎస్‌బీఐ కార్డ్స్, పేటీఎం, మైటాగ్ ఇండస్ట్రీస్, ముత్తూట్ గ్రూప్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీల్లో 205 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. ప్రొబేషనరీ ఆఫీసర్, జూనియర్ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, టెలీ అకౌంట్స్ అసిస్టెంట్, గ్రాఫిక్ డిజైనర్, టెలీకాలింగ్, ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులు. 18-45 ఏళ్ల వయసు ఉన్న పురుష, మహిళా అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చు. జీతం నెలకు రూ.18 వేల నుంచి రూ.25 వేల వరకు ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు https:// employment.ap.gov.in/ లో పేర్లు నమోదు చేసుకుని.. జాబ్‌మేళాకు హాజరు కావాలని సుబ్బిరెడ్డి కోరారు.

గిరిప్రదక్షిణకు పక్కా ఏర్పాట్లు



గిరి ప్రదక్షిణ ట్రయల్ రన్ కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీపీ బాగ్చి

సింహాచలం: ఈనెల 20న జరిగే గిరిప్రదక్షిణ, 21న జరిగే శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రదక్షిణకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం ఎంపీ భరత్, కలెక్టర్ హరేందిర ప్రసాద్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ విశ్వనాథ్, నగర పోలీస్ కమిషనర్ సంఖబ్రత బాగ్చి, దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, పలు శాఖల అధికారులతో కలిసి సింహాచలంలోని ఓ ప్రైవేటు కల్యాణమండపంలో సమీక్ష నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఏర్పాట్లను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ గిరిప్రదక్షిణ ప్రారంభమయ్యేనాటికి అడవివరంలోని బీఆర్‌టీఎస్ రోడ్డును పూర్తిచేయడంతో పాటు, గిరి ప్రదక్షిణ జరిగే 32 కిలోమీటర్లు మేర ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ అధికారులకు సూచించారు. త్వరలోనే పంచగ్రామాల సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఎంపీ భరత్ మాట్లాడుతూ 21న వీఐపీల దర్శనాలు సాధారణ భక్తులపై పడకుండా అధికారులు జాగ్రత్త వహించాలని సూచించారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ గిరిప్రదక్షిణ జరిగే 32 కిలోమీటర్ల పరిధిలో 28 చోట్ల ప్రత్యేక స్టాళ్లు, 11 ప్రదేశాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా 290 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రహదారుకు మరమ్మతులు చేస్తున్నామని, గిరిప్రదక్షిణనాటికి బీఆర్‌టీఎస్ రోడ్డును అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అంబులెన్స్‌లు, ఐసీడీఎస్ ద్వారా ఎక్కడికక్కడ ఫీడింగ్ రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో నగర సంయుక్త సీపీ ఫకీరప్ప, డీసీపీ సత్తిబాబు, ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్, 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం పాల్గొన్నారు. గిరిప్రదక్షిణ జరిగే మార్గంలో ఆయా శాఖల అధికారులు మంగళవారం బస్సులో వెళ్లి ఏర్పాట్లు పరిశీలించారు.

అప్పుఘర్ నుంచి తొలి పావంచా వరకు ట్రయల్ రన్

గిరిప్రదక్షిణ మహోత్సవ ఏర్పాట్లను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పరిశీలించారు. పోలీస్ కమిషనర్ సంఖబత్ర బాగ్చి, జీవీఎంసీ ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్, ఆలయ ఈవో శ్రీనివాసమూర్తి, ఇతర అధికారులతో కలిసి మంగళవారం కలెక్టర్ ట్రయల్ రన్ నిర్వహించారు.

అటకెక్కిన చదువులు

విద్యాభివృద్ధికే అగ్రతాంబూలం.. చదువుల కోసం చేస్తున్న ఖర్చు రాష్ట్ర బంగారు భవిష్యత్తుకు పెడుతున్న పెట్టుబడి అని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పేవారు. చెప్పడమే కాదు విద్యా రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. జూనియర్ కాలేజీలుగా హైస్కూళ్లను అప్‌గ్రేడ్ చేయడం అందులో ఒకటి. ఈ విద్యా సంవత్సరం నుంచి జిల్లాలో మూడు ఉన్నత పాఠశాలల స్థాయిని పెంచారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో ప్రాధాన్యాలు మారాయి. అరకొర వసతులతోనే తరగతులు ప్రారంభమయ్యాయి.



నాతవరం హైస్కూల్ గదిలో నిర్వహిస్తున్న జూనియర్ కాలేజీ తరగతులు



విద్యార్థుల ఇంటికి వెళ్లి కాలేజీలో చేరాలని వివరిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

- జూనియర్ కాలేజీలుగా మూడు హైస్కూళ్ల అప్‌గ్రేడ్
- లెక్చరర్లను నియమించకపోవడంతో ఉపాధ్యాయులతోనే బోధన

నాతవరం: ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి నాతవరం, ఎస్.రాయవరం, అచ్యుతాపురం మండలాల్లోని హైస్కూళ్లను జూనియర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేశారు. ఉన్నత చదువుకు దూరం వెళ్లనక్కర్లేదని ఆశ పడ్డ విద్యార్థులు ఇప్పుడు కాలేజీలో ఎందుకు చేరామని చింతిస్తున్నారు. మౌలిక సదుపాయాలు కల్పించకపోవడమే కాక లెక్చరర్లను సైతం నియమించలేదు. హైస్కూల్ ఉపాధ్యాయులే తరగతులు బోధిస్తున్నారు. సొంత మండలంలోనే కాలేజీ మంజూరైంది.. ఇతర ప్రాంతాలకు పోకుండా కాలేజీ విద్య స్థానికంగా లభ్యమవుతుందని విద్యార్థులు ఆశ పడ్డారు. హైస్కూల్‌ను అప్‌గ్రేడ్ చేశాం.. మీరంతా కాలేజీ విద్య మా వద్ద చదువుకోవాలంటూ విద్యాశాఖ అధికారులు ప్రత్యేక వాహనాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ ఏడాది 10వ తరగతి పాసైన విద్యార్థుల ఇంటికి స్వయంగా ఉపాధ్యాయులు వెళ్లి మన హైస్కూల్లోనే ప్రభుత్వం కాలేజీ మంజూరు చేసిందని, మీరంతా ఇక్కడే జాయిన్ కావాలని చెప్పారు. వారి మాట మీద నమ్మకంతో సొంత మండలంలోనే కాలేజీలో చేరిన విద్యార్థులకు నిరాశ ఎదురైంది.

బైపీసీ గ్రూప్ హుళక్కి

నాతవరం మండలంలో ఏర్పాటు చేసిన కాలేజీకి ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు మంజూరు చేసినట్లు ప్రచారం చేశారు. చాలామంది విద్యార్థులు బైపీసీలో జాయిన్ అయ్యేందుకు కాలేజీకి వచ్చారు. జాయిన్ అయ్యే సమయంలో నాతవరం కాలేజీకి బైపీసీ గ్రూపు మంజూరు చేయలేదని, ఎంపీసీ, సీఈసీ గ్రూపులు మాత్రమే ఉన్నాయన్నారు. చేసేది లేక ఆయా గ్రూపుల్లో విద్యార్థులు జాయిన్ అయ్యారు. కాలేజీలో తరగతులు నిర్వహించేందుకు ప్రభుత్వం అధ్యాపకులను నియమించలేదు. హైస్కూల్లో ఉన్న ఉపాధ్యాయులతోనే నామమాత్రంగా కాలేజీ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. హైస్కూలు విద్యార్థులకే ఉపాధ్యాయుల కొరత ఉన్న దశలో వారిపై కళాశాల బోధన బాధ్యత కూడా పడింది. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మను వివరణ కోరగా.. కొత్తగా మంజూరు చేసిన కాలేజీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఇటీవల ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. గత ఏడాది ప్రారంభించిన నాలుగు కాలేజీలకు మొదట వసతి సర్దుబాటు చేసి ఉపాధ్యాయులను నియమించామన్నారు. మిగతా కాలేజీల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించామన్నారు.

నిఘా నేత్రం.. రేవతి

- భారత నౌకాదళ అమ్ములపొదిలో 3డీ రాడార్
- ముప్పును ముందే గుర్తించే అత్యాధునిక వ్యవస్థ
- 6, 12, 24 ఆర్‌పీఎంల సామర్థ్యంగల 3 యాంటెన్నాలు
- డీఆర్‌డీవో సహకారంతో బీఈఎల్‌లో తయారీ



యుద్ధ నౌకల్లో రేవతి రాడార్

సాక్షి, విశాఖపట్నం: దేశ రక్షణ వ్యూహంలో రాడార్ వ్యవస్థ కూడా కీలకం. రక్షణ రంగంలో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శిస్తున్న భారత్ సొంతంగా రాడార్ వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో గణనీయమైన పురోగతి సాధిస్తోంది. ఆత్మ నిర్భర్ భారత్ పేరుతో పూర్తిస్థాయి స్వదేశీ పరిజ్ఞానంతో యుద్ధనౌకలు, సబ్‌మెరైన్‌లు, యుద్ధవిమాన వాహక నౌకలను సిద్ధం చేసుకుంటున్న ఇండియన్ నేవీ.. రాడార్లలోనూ అదే జోరు ప్రదర్శిస్తోంది. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఇప్పటికే చురుకైన పాత్ర పోషిస్తున్న ఎయిర్ రాడార్ రోహిణి మాదిరిగా.. నేవీలో అంతకుమించిన పరిజ్ఞానంతో త్రీడీ రాడార్ రేవతి సిద్ధమైంది. భారతదేశం రక్షణ విషయంలో ఎప్పటికప్పుడు యుద్ధసామర్థ్య వ్యూహాలను రెట్టింపు చేసుకుంటూ వస్తోంది. భారత నౌకాదళంలో అత్యాధునిక వ్యవస్థలన్నీ సాంకేతికత ఆధారంగానే పనిచేస్తున్నాయి. అగ్రరాజ్యం అమెరికా సహా రష్యా, చైనా, ఫ్రాన్స్, ఇజ్రాయిల్ వంటి దేశాలతో పోటీపడుతూ రక్షణ రంగంలో సాంకేతికపరంగా భారత్ బలీయంగా ఎదుగుతోంది. ఇందులో భాగంగానే రాడార్ల వంటి అనేక రక్షణ రంగ పరికరాలను దేశీయంగా తయారు చేస్తోంది. ఇప్పటికే వాయుసేనలో రోహిణి, సరిహద్దు సైన్యం బీఎస్‌ఎఫ్ కోసం బాటిల్ ఫీల్డ్ సర్వైలెన్స్ రాడార్, యుద్ధ ట్యాంకులు, క్షిపణులపైన వినియోగించేలా రాజేంద్ర వంటి రాడార్లు సిద్ధం చేసిన డీఆర్‌డీఏ.. తాజాగా రేవతిని మరింత బలీయంగా రూపొందించింది.

150కి పైగా లక్ష్యాలను పసిగట్టేలా..

గాల్లో లక్ష్యాలైన శత్రుదేశ విమానాలు, క్షిపణులు, హెలికాప్టర్లు వంటి వాటిని గుర్తించేందుకు రాడార్లు వినియోగిస్తున్నారు. ఒక దేశ రాడార్ వ్యవస్థ బలంగా ఉంటే శత్రుదేశాల విమాన, క్షిపణి దాడులను సమర్థంగా ఎదుర్కోవచ్చు. యుద్ధంలో ప్రతి దేశం తొలుత.. తన శత్రుదేశ రాడార్ వ్యవస్థలను నాశనం చేసి పైచేయి సాధించాలని చూస్తుంది. అందుకే రాడార్ల విషయంలో భారత రక్షణ పరిశోధన సంస్థ (డీఆర్‌డీవో) విభిన్న ప్రయోగాలు చేస్తూ అత్యాధునికమైన వాటిని అందుబాటులోకి తీసుకొస్తోంది. ఇందులో భాగంగానే స్వదేశీ పరిజ్ఞానంతో త్రీడీ టెక్నాలజీతో యుద్ధనౌకల్లో మొదటిసారిగా వినియోగించే రేవతి రాడార్‌ని అభివృద్ధి చేసింది. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)తో కలిసి రేవతిని తయారు చేసింది. యుద్ధ నౌకలపై లక్ష్యాలను పసిగట్టడంలో దిట్టగా.. 150కి పైగా లక్ష్యాలను ఒకే సమయంలో ట్రాకింగ్ చేసేలా ఆటోమేటిక్ నిఘా రాడార్ రేవతి సిద్ధమైంది. కమోర్తా క్లాస్ యుద్ధ నౌకల్లో రేవతి రాడార్‌ను ప్రయోగాత్మకంగా వినియోగించారు. త్వరలోనే అన్ని యుద్ధ నౌకల్లో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఇండియన్ నేవీ సిద్ధమవుతోంది.

స్వదేశీ పరిజ్ఞానంతో.. తొలి రాడార్

- త్రీడీ టెక్నాలజీతో యుద్ధనౌకల్లో వినియోగించేలా తయారైన తొలి రాడార్
- గాల్లోను, సముద్రంలోను లక్ష్యాలను అత్యంత సులువుగా పసిగడుతుంది
- ట్రాకింగ్‌తోపాటు 150కి పైగా లక్ష్యాలను ఆటోమేటిక్‌గా గుర్తిస్తుంది
- రేవతిలో 6, 12, 24 రొటేషన్ పర్ మినిట్ (ఆర్‌పీఎం) సామర్థ్యంగల మూడు యాంటెన్నాలు ఉన్నాయి. వీటి ద్వారా లక్ష్యాలను సులువుగా గుర్తిస్తుంది
- లక్ష్యాలను కనిపెట్టిన వెంటనే డేటాను క్షణాల్లో యాంటెన్నా ద్వారా కంట్రోల్ రూమ్‌కు పంపిస్తుంది.

క్లుప్తంగా

అప్పన్నకు ఘనంగా ఊంజల్ సేవ



ఊంజల్‌సేవను నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న లక్ష్మీకాంత్ నాయక్‌దాస్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఒడిశాకి చెందిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ ఊంజల్ సేవను జరిపించారు. ఆలయ ఆస్థాన మండపంలో సాయంత్రం 5 గంటల నుంచి అర్చకులు ఈసేవను వైభవంగా నిర్వహించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామిని, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. శేషతల్పవాహనంపై స్వామిని, అమ్మవార్లను వేంజేంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం షోడషోపచార పూజలు నిర్వహించారు. అనంతరం ద్వాదశారాధలతో స్వామికి విశేషంగా పూజలు నిర్వహించారు. దాసుడు తీసుకొచ్చిన పలు పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. అనంతరం స్వామి వారిని లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్ కీర్తిసూ ఊంజల్ సేవను నిర్వహించారు. వింజామరతో స్వామికి సేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఒడిశా సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. ఆలయ స్థానాచార్యులు టీపీ రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, ఏఈవో ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

పొలంలో గడ్డి కోస్తూ విద్యుత్ షాక్‌తో రైతు మృతి

బుచ్చెయ్యపేట : తురకలపూడికి చెందిన రైతు తోకల సత్తిబాబు(61) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. మంగళవారం సాయంత్రం సత్తిబాబు తన పొలంలో ఉన్న మోటారు కనెక్షన్ వద్ద పశువులకు గడ్డి కోస్తున్నాడు. గడ్డి కోస్తున్న ప్రదేశంలో భూమిపై పడివున్న మోటారు వైరును గమనించలేదు. గడ్డితో పాటు విద్యుత్ వైరును కొడవలితో కోయడంతో సత్తిబాబు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. దీంఠ స్పృహ తప్పి పడిపోయిన సత్తిబాబును కుటుంబ సభ్యులు అనకాపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి మృతితో రేపటి నుండి ఎలా బతకాలో అని మృతుడి భార్య సోమేశ్వరి, కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు.

కన్నుల పండువగా తిరుగు రథయాత్ర

మునగపాక : మండలంలోని నాగులాపల్లిలో మంగళవారం సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామి తిరుగు రథయాత్ర ఘనంగా జరిగింది. జగన్నాథుని ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పండగ చేసుకునే కుటుంబాలకు చెందిన భక్తులంతా ఘటాలతో జేగంటల నడుమ పండగను వేడుకగా జరుపుకొన్నారు. సాయంత్రం ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి గ్రామంలో అన్ని వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మళ్ల ఉమా కాశీ ఉత్సవాన్ని పర్యవేక్షించారు.



ఘటాలతో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

జగన్నాథుని రథం లాగుతున్న భక్తులు, (ఇన్‌సెట్) రథంలో కొలువు దీరిన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామి



ప్రతి గ్రామంలో ముమ్మర పారిశుధ్య చర్యలు

- జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి

కె.కోటపాడు : వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య సమస్య తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై పలు అంశాలు చర్చించారు. గ్రామాల్లో మంచినీటి పథకాల క్లీనింగ్, క్లోరినేషన్ పనులను నిర్దేశించిన సమయాల్లో తప్పనిసరిగా చేయించాలని సూచించారు. వైద్య సిబ్బందితో కలిసి స్టాప్ డయేరియా కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కొరువాడ జగన్నాథపురంలో గల లేఅవుట్ నిబంధనల మేరకు లేదని పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదు మేరకు లేఅవుట్‌ను ఆమె సందర్శించారు. రెండు రోజుల్లో లేఅవుట్‌పై పూర్తి సమాచారంతో తనకు నివేదికను అందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి నాగమణి, ఈవోఆర్డీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు ఎస్.రామునాయుడు, వి.ప్రసాద్, కె.భీమరాజు, ప్రశాంత్‌కుమార్, దర్మ, ఖాన్, అనురాధ, సౌజన్య, సౌందర్య పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో పాల్గొన్న డీపీవో శిరీషారాణి

చౌక ధరల్లో బీపీటీ బియ్యం, కందిపప్పు విక్రయం

- జిల్లా పౌరసరఫరాల అధికారి కె.వి.ఎల్.ఎన్.మూర్తి

తుమ్మపాల : పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో బీపీటీ బియ్యం, కందిపప్పు రైతు బజార్లు, రిలయన్స్, డీమార్ట్, మోర్, స్పెన్సర్ వంటి వర్తక కేంద్రాల్లో ప్రత్యేక ధరకు విక్రయించడానికి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్టు జిల్లా పౌరసరఫరాల అధికారి కె.వి.ఎల్.ఎన్.మూర్తి తెలిపారు. బియ్యం బీపీటీ (స్టీమ్డ్) కిలో రూ.49, (పచ్చి) కిలో రూ.48కి ,కందిపప్పు కిలో రూ.160కి అందుబాటులో ఉంటుందన్నారు. ఒక్కో వినియోగదారు కందిపప్పు కిలో, బియ్యం 5 కిలోలు కొనుగోలు చేయవచ్చన్నారు.

అందుబాటులో గల దుకాణాల వివరాలివి.

అనకాపల్లి పట్టణంలో : ఎంఎంఎస్.జోగారావు అండ్ కంపెనీ, మెయిన్‌రోడ్డు, వేదుల వారివీధిలో శ్రీకన్యకాపరమేశ్వరీ ట్రేడింగ్, ఓల్డ్ బస్‌స్టాండ్ రోడ్‌లో రంగనాథ ట్రేడర్స్, శ్రీకన్యాకాపరమేశ్వరీ దేవాలయం రోడ్డులో ఎంఎంఎస్. బత్తు వీరభద్ర ప్రకాశరావు, డీమార్ట్, రిలయన్స్ మార్ట్, విశాల్ మార్ట్,

యలమంచిలి పట్టణంలో : కోర్ట్ పేట శ్రీవేంకటేశ్వర ట్రేడింగ్ కంపెనీ, కోమటిపేట న్యూఫాతిమా స్టోర్స్

నర్సీపట్టణంలో : మెయిన్‌రోడ్డులో గల సుతాపల్లి నరసింహ మూర్తి హోల్‌సేల్ షాపు

బుచ్చెయ్యపేటలో : వడ్డాది జంక్షన్‌లో పలుకూరి బంగార్రాజు జనరల్ మర్చెంట్, వడ్డాది చోడవరం రోడ్డులో ఇంటి స్టోర్స్, చోడవరం రిలయన్స్ స్మార్ట్ పాయింట్, అలాగే సబ్బవరంలో రిజయన్స్ స్మార్ట్ బజార్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. ప్రజల సౌకర్యార్థం మరిన్ని కేంద్రాల్లో అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

రైల్వేస్టేషన్లో 19.5 కేజీల గంజాయి స్వాధీనం



రైల్వేస్టేషన్‌లో గంజాయి నిందితులతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం(విశాఖ): విశాఖ రైల్వే స్టేషన్‌లో మంగళవారం గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలియజేసిన వివరాలు... రైల్వేస్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో మంగళవారం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయ నాయుడు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ హెచ్‌డీ శర్మ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పలువురు లగేజీలను తనిఖీ చేసే సమయంలో కృష్ణా జిల్లాకు చెందిన ఉప్పరపల్లి దినేష్‌రెడ్డి, కర్ణాటకకు చెందిన బాబావాలి, మహారాష్ట్రకు చెందిన అన్సారి అమీర్ సోహెల్‌లు అక్రమంగా గంజాయిని తరలించడాన్ని గుర్తించారు. వీరి నుంచి సుమారు 97.5 వేల రూపాయల విలువైన 19.5కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని సీజ్ చేసి, సదరు వ్యక్తులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు జీఆర్పీ అధికారులు తెలిపారు.

రోడ్లపై రంగురంగుల ఉప్పు బండలు



రోడ్లపై పింక్ సాల్ట్ నగర రోడ్లపై

విశాఖ : నగర రోడ్లపై సరికొత్త ఉప్పు దర్శనమిస్తోంది. హిమాలయన్ పింక్, బ్లాక్ ఉప్పుల బండలు ఎక్కడపడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. గ్రానైట్ రాళ్ల తరహాలో ఉంటే ఈ సాల్ట్ కిలో రూ.100కు విక్రయిస్తున్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్, ఎసిడిటీల నియంత్రణకు బాగా ఉపకరిస్తుందని బ్యానర్లు కట్టుకుని అమ్ముతున్నారు. సిరిపురం నుంచి వాల్తేరు వెళ్లే మార్గంలో, అలాగే మద్దిపాలెం నుంచి ఎన్ఏడీ మార్గంలో.. ఇలా పలు చోట్ల ఈ తరహా సాల్ట్‌ల విక్రయాలు జరుగుతున్నాయి.

మద్యం మత్తులో సబ్‌సెంటర్‌పై వ్యక్తి దాడి

- మందులు సామగ్రి ధ్వంసం
- పోలీసులకు ఫిర్యాదు



సబ్ సెంటర్‌లో చిందరవందరగా పడి ఉన్న మందులు, కుర్చీలు

మాకవరపాలెం : వైద్య సిబ్బందిని బెదిరించి, సబ్ సెంటర్‌లో సామాగ్రిని ధ్వంసం చేసిన వ్యక్తిపై గిడుతూరు ఏఎన్ఎం సామిరెడ్డి నాగలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ గ్రామంలోని ఒక ప్రైవేటు భవనంలో సబ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. ఇదే గ్రామానికి చెందిన మూకల రమణబాబు మంగళవారం మద్యం సేవించి సబ్ సెంటర్‌కు వచ్చాడు. దీంతో వైద్యం నిమిత్తం వచ్చిన ఒక మహిళ ముక్కు మూసుకోవడంతో నేను తాగుబోతునా అంటూ దురుసుగా ప్రవర్తించి, కోపంతో కుర్చీలను పక్కనే ఉన్న ఆశ కార్యకర్త పాశపు రామరత్నంపైకి విసిరాడు. దీంతో ఆమెకు గాయాలయ్యాయని, అంతటితో ఆగకుండా మందులు, సామాగ్రిని కిందికి విసిరేసి ధ్వంసం చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. నోటికి వచ్చినట్టు మాట్లాడి, మీ సంగతి చూస్తానంటూ బెదిరించినట్టు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారణ చేస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.

బావిలో జారి పడి వ్యక్తి మృతి

నాతవరం: ఇంటి సమీపంలో నేలబావి చుట్టూ పిచ్చిమొక్కలు తొలగిస్తుండగా ప్రమాదశావత్తు జారి పడి వ్యక్తి మృతి చెందాడు. మండలంలో ఎం.బి. పట్నంలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. నాతవరం హెడ్ కానిస్టేబుల్ నాగరాజు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉలబాల సత్యనారాయణ (45)తన ఇంటి వెనుక భాగంలో బావి చుట్టూ పిచ్చిమొక్కలు తొలగిస్తున్నాడు. ఈ క్రమంలో అక్కడ బురదలో జారిపడి ప్రమాదశావత్తు బావిలో పడిపోయాడు. అందులో నుంచి బయటపడలేక మృతి చెందాడు. మృతుడు కుమార్తె పద్మ ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి మృతదేహన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ నాగరాజు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారన్నారు.

కనిపిస్తే.. చంపకండి

ఘనంగా ప్రపంచ పాముల దినోత్సవం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీసీఎఫ్ శాంతిప్రియా పాండే

ఆరిలోవ: పాములను సంరక్షించాలని, కనిపిస్తే చంపవద్దని ఏపీ సీసీఎఫ్(వైల్డ్‌లైఫ్) డాక్టర్ శాంతిప్రియా పాండే అన్నారు. ఇందిరా గాంధీ జూ పార్కులో జూ అధికారులు, ఈస్టర్న్ ఘాట్ వైల్డ్ లైఫ్ సొసైటీ ప్రతినిధులు కలిసి మంగళవారం ప్రపంచ పాముల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతి ప్రియా పాండే వారితో కలిసి పాముల సంరక్షణ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతలో పలు రకాల పాముల జాతులు కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. విశాఖ రేంజ్ సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి జీవ వైవిధ్యంలో పాముల పాత్రపై మాట్లాడారు. సొసైటీ వ్యవస్థాపకుడు, సీఈవో కంటిమహంతి మూర్తి, అటవీ అధికారి ప్రదీప్తి భరద్వాజ్, జూ క్యూరేటర్ జి.మంగమ్మ, జూ డాక్టర్ ఫణీంద్ర, పలువురు అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేట డైవర్షన్ రోడ్డులో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు



పేట డైవర్షన్ రోడ్డులో మరమ్మతులతో ఆగిపోయిన ఆర్టీసీ బస్సు



ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన పలు వాహనాలు

- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- అవస్థలు పడ్డ ప్రయాణికులు

బుచ్చెయ్యపేట : భీమునిపట్నం, నర్సీపట్నం(బీఎస్) రోడ్డులో విజయరామరాజుపేట వద్ద తాచేరు వంతెనపై ఉన్న డైవర్షన్ రోడ్డులో ఆర్టీసీ బస్సు మరమ్మతులకు గురై నిలిచిపోయింది. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మంగళవారం ఉదయం నర్సీపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు చోడవరం నుంచి ప్రయాణికులతో నర్సీపట్నం బయలుదేరింది. విజయరామరాజుపేట తాచేరు వంతెనపై డైవర్షన్ రోడ్డు మధ్యలోకి వచ్చిన తరవాత బస్సు గేర్ బాక్స్ దెబ్బతిని ఆగిపోయింది. ఇప్పటికే తాచేరు నదిపై ఉన్న వంతెన కూలిపోగా తాత్కాలికంగా వేసిన డైవర్షన్ రోడ్డులో నుంచి వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డు మధ్యలో బస్సు ఉండిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. నర్సీపట్నం, చోడవరం, అనకాపల్లి,విశాఖపట్నం,పాడేరు తదితర రహదారుల్లో వెళ్లే ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనాలు వంతెనకు రెండు వైపులా కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌లో నిలిచిపోయాయి. బుచ్చెయ్యపేట ఎస్ఐ డి. ఈశ్వరరావు తమ సిబ్బందితో వచ్చి ఆగిపోయిన బస్సును పక్కకి తీయించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. విధులకు వెళ్లే ఉద్యోగులతో పాటు పలువురు వ్యాపారులు, అత్యవసర పనులపై వెళ్లే వారు ఇబ్బందులు పడ్డారు. కొందరు వాహనదారులు కుముదాంపేట, మంగళాపురం ముకుందపురం మీదుగా వడ్డాది,మాడుగుల రూటులో రాకపోకలు సాగించారు.

'సహారా' ఖాతాదార్లకు డిపాజిట్లను తక్షణమే చెల్లించాలి



మాట్లాడుతున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న

దేవరాపల్లి : సహారా ఇండియా ఖాతాదార్లకు డిపాజిట్లను తక్షణమే చెల్లించాలని లేకుంటే ఆందోళన చేపడతామని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. వెంకన్న డిమాండ్ చేశారు. దేవరాపల్లిలో మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. సహారా ఇండియా సంస్థ ఖాతాదార్లకు, ఏజెంట్లకు పూర్తి స్థాయిలో డబ్బులు చెల్లించాలన్నారు. తమ సంస్థలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశ చూపి ఏజెంట్ల ద్వారా ఖాతాదారుల నుండి కోట్లాది రూపాయలు వసూలు చేయించిందన్నారు. ఎంతగానో నమ్మిన ఖాతాదార్లను, ఏజెంట్లను సంస్థ మోసగించిందన్నారు. ఖాతాదార్లకు ఇచ్చిన బాండ్ల గడువు ముగిసినా డబ్బులు ఇవ్వకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. 2012లో 15 శాతం వడ్డీతో ఖాతాదార్లకు వారి డిపాజిట్ సొమ్మును చెల్లించాలని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇప్పటి వరకు ఒక్కరికీ కూడా సక్రమంగా చెల్లించలేదన్నారు. వేల కోట్ల రూపాయల డిపాజిట్లు సేకరించి సహారా ఇండియా సంస్థ ప్రజలకు చెల్లించక పోయినప్పటికీ మోదీ ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం అత్యంత దారుణమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి సహారా ఇండియా ఖాతాదార్లకు డిపాజిట్లు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

టీడీపీ వర్సెస్ టీడీపీ

- వెనుకనుంచి నడిపిస్తున్న కీలకనేత?
- సొంత పార్టీ కార్పొరేటర్ గోవిందరెడ్డిపై కేసు నమోదు

గాజువాక : గాజువాక టీడీపీ నాయకుల మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి. వివిధ కారణాలతో చోటుచేసుకొంటున్న ఆరోపణలను అస్త్రాలుగా మార్చుకొని ఒకరిపై ఒకరు కారాలు మిరియాలు నూరుకొంటున్నారు. ఈ విషయాల్లో గాజువాకకు చెందిన ఒక కీలక నేత తెర వెనుక నుంచి కథ నడిపిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. సొంత పార్టీ నాయకులు, కార్పొరేటర్లపై ఇలాంటి పరిస్థితి చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా 69వ వార్డు కార్పొరేటర్, టీడీపీ సీనియర్ నాయకుడు కాకి గోవిందరెడ్డిపై గాజువాక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో ఆ పార్టీ నాయకుల్లో జోరుగా చర్చ సాగుతోంది. దీనికోసం ఆ కీలక నేత తమ కూటమిలోని జనసేన పార్టీ నాయకులను సైతం ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

69వ వార్డులో ఒక చీటీల నిర్వాహకుడి ఇంటిని కాకి గోవిందరెడ్డి బలవంతంగా సొంతం చేసుకున్నారన్న ఆరోపణలు వ్యక్తమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ వార్డుకు చెందిన జనసేన పార్టీ నాయకుడు ముత్యాలరావు మరికొన్ని అంశాలపై అధికారులకు ఫిర్యాదు చేశారు. గోవిందరెడ్డి తమ గ్రామంలో చెరువును ఆక్రమించారని, స్కూల్ స్థలాన్ని కబ్జా చేశారని, ఇంకా వివిధ రకాల అక్రమాలకు పాల్పడ్డారంటూ సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. స్కూల్ స్థలం ఆక్రమణ ఫిర్యాదుపై స్పందించిన గాజువాక మండల విద్యాశాఖాధికారి ఈ విషయాన్ని గాజువాక పోలీసులకు తెలియజేశారు. దీంతో పోలీసులు గోవిందరెడ్డిపై కేసు నమోదు చేశారు. అయితే, ఈ ఫిర్యాదు వెనుక కీలకనేత ప్రోత్సాహం ఉందనే ఆరోపణలున్నాయి. అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్‌పై వెంటనే కేసు నమోదైపోవడం, అది కూడా తాజా సంఘటన కాకపోయినప్పటికీ కేసు నమోదు కావడం పట్ల ఆ పార్టీ నాయకులు సైతం విస్మయం చెందుతున్నారు. అధికారంలో ఉన్నప్పటికీ సొంత పార్టీ నాయకులపై కూడా కేసులు నమోదు కావడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేను అక్రమాలకు పాల్పడలేదు

నేను ఎటువంటి కబ్జాలకు పాల్పడలేదు. కార్పొరేటర్‌గా గెలిచినప్పటి నుంచి వార్డులో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతోపాటు సేవా కార్యక్రమాలు చేశాను. ఆలయాలను నిర్మించాను. రాజకీయంగా నాపై కొంతమంది కుట్ర చేసి ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారు. నాపై ఆరోపణలు చేసిన వారిపై పరువు నష్టం దావా వేస్తాను.

– కాకి గోవిందరెడ్డి, 69వ వార్డు కార్పొరేటర్

తిరునల్వేలి-షాలిమర్ మధ్య ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: తిరునల్వేలి-షాలిమర్-తిరునల్వేలి మధ్య దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. తిరునల్వేలి-షాలిమర్ (06087) స్పెషల్ ఈ నెల 18, 25వ తేదీల్లో తిరునల్వేలిలో తెల్లవారు 1.50 గంటలకు బయలుదేరి మరుసటిరోజు తెల్లవారు 4.57 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 5.02 గంటలకు బయలుదేరి శుక్రవారాల్లో రాత్రి 9గంటలకు షాలిమర్ వెళ్తుంది. షాలిమర్-తిరునల్వేలి (06088) స్పెషల్ ఈ నెల 20, 27వ తేదీల్లో షాలిమర్‌లో సాయంత్రం 5.10 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.52 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.57 గంటలకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.15 గంటలకు తిరునల్వేలి వెళ్తుంది.

విద్యార్థుల భవితకు భరోసా

- ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం
- ఎంపికైతే రూ.10 వేలు ప్రోత్సాహక బహుమతి
- విద్యార్థుల చదువు పూర్తయ్యే వరకు స్కాలర్‌షిప్



ప్రాజెక్టులను సిద్ధం చేస్తున్న సింహాచలం గురుకుల విద్యార్థులు

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎంపికైన ప్రాజెక్టులు

2020-21 : 255

2021-22 : 240

2022-23 : 200

2023-24 : 316

విశాఖ విద్య : ఒక ఐడియా విద్యార్థుల భవిష్యత్ చదువులకు భరోసాగా నిలవనుంది. విద్యార్థి ఆలోచన నిర్వాహకులకు నచ్చితే రూ.10 వేలు నగదు బహుమతి ఇస్తారు. ఆ డబ్బులతో తయారు చేసే సైన్సు సంబంధిత ప్రాజెక్టుతో జాతీయ స్థాయి వరకు నిర్వహించే పోటీల్లో పాల్గొనవచ్చు. విద్యార్థి ప్రదర్శించిన ప్రాజెక్టు జాతీయ స్థాయిలో ఎంపికైతే బంపర్ బొనాంజా తగిలినట్లే. ఉన్నత చదువు పూర్తయ్యేంత వరకు స్కాలర్ షిప్‌తో కేంద్ర ప్రభుత్వం తోడ్పాటు నందిస్తోంది.

మేధోశక్తికి పదునుపెట్టేలా తోడ్పాటు

విజ్ఞాన, శాస్త్ర సాంకేతిక రంగాలపై పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు మక్కువ పెంచేలా ప్రభుత్వం ప్రత్యేక తోడ్పాటు అందిస్తోంది. ఈ నేపథ్యంలోనే 'ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనాక్' పేరిట ఏటా రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీలను నిర్వహిస్తూ, విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న మేధోశక్తికి పదును పెట్టేలా ప్రోత్సాహాన్ని అందిస్తోంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ) ఆధ్వర్యంలో 2024–25 విద్యా సంవత్సరానికి 'ఇన్‌స్పైర్ అవార్డ్స్–మనాక్' పేరిట సైన్స్ ప్రయోగాలకు విద్యార్థులను సిద్ధం చేస్తూ, వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

ఆలోచన చెబితే చాలు

సృజనాత్మకత, నూతనత్వంతో కూడిన పర్యావరణహితమైన, సామాజిక, సమస్యలకు పరిష్కారం సూచించే విధంగా విద్యార్థులు తమ మేధోశక్తిని రంగరించి చక్కటి ఆలోచన చెబితే చాలు. దానిని డ్రాఫ్ట్ రూపంలో తీర్చిదిద్ది ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనాక్ వెబ్ సైట్‌లో [illegible] అప్‌లోడ్ చేయాలి. ఇదే సమయంలో విద్యార్థి పేరు, పాఠశాల, యూడైస్ కోడ్, రెవెన్యూ డివిజన్, జిల్లా, విద్యార్థి బ్యాంకు అకౌంట్ నంబర్‌ను వెబ్ సైట్‌లో పొందుపరచాలి.

ఎంపికైతే రూ.10 వేలు

జిల్లాలోని ప్రభుత్వ ఆధ్వర్యంలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలతో పాటు, ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు సైతం ఇన్‌స్పైర్ అవార్డ్స్‌కు తమ ఆలోచనలను పంపించవచ్చు. 6 నుంచి 10వ తరగతి వరకు, 10 నుంచి 15 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు దీనికి అర్హులు. ప్రతీ పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు సెప్టెంబర్ 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లా స్థాయిలో నియమితులైన కమిటీ విద్యార్థులు పంపించిన అంశాలను పరిశీలించి మంచి ఆలోచనలను ఎంపిక చేస్తారు. ఇలా ఎంపికైన విద్యార్థులకు రూ.10 వేలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



ఇన్‌స్పైర్‌లో ప్రాతినిధ్యం వహించే విద్యార్థులు భవిష్యత్‌లో అనేక అవకాశాలు ఉన్నాయి. ఎక్కువ మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం ద్వారా ప్రయోజనం చేకూరుతుంది. విశాఖ జోన్ పరిధిలో ఈసారి ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు భాగస్వామ్యులయ్యేలా చూస్తున్నాం. దీనిపై జిల్లా సైన్స్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

– బి.విజయ భాస్కర్, ఆర్జేడీ, విశాఖపట్నం

ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తాం



ఇన్‌స్పైర్ మనాక్ పోటీలు సైన్స్ పట్ల విద్యార్థుల్లో మరింత ఇష్టం పెంచేలా దోహదపడతాయి. గతేడాది ఉమ్మడి విశాఖ జిల్లా 316 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరందరికీ రూ.10 వేలు చొప్పున మంజూరయ్యాయి. ఈసారి ఇన్‌స్పైర్ అవార్డ్స్‌లో ఎక్కువ మంది విద్యార్థులు భాగస్వాములయ్యేలా ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తాం.

– కె.ప్రసాద్, జిల్లా సైన్సు అధికారి

క్లుప్తంగా

దుకాణాల కేటాయింపుపై విచారణ

కశింకోట: స్థానిక సంతబయల ప్రాంతంలో పంచాయతీ దుకాణాల కేటాయింపుపై మంగళవారం సాయంత్రం జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి విచారణ జరిపారు. వీటి కేటాయింపుపై స్థానిక కూరగాయల వ్యాపారుల నుంచి ఫిర్యాదు వచ్చిన నేపథ్యంలో పరిశీలించి దుకాణాలను ఎలా కేటాయించారనే విషయమై దుకాణదారులను కలిసి ఆరా తీశారు. దుకాణాలను ఏ విధంగా కేటాయించారనే విషయమై పంచాయతీ కార్యదర్శి రమేష్‌ను ప్రశ్నించగా పంచాయతీ తీర్మానం అనుసరించి కేటాయించినట్లు బదులిచ్చారు. దుకాణాల కేటాయింపు విషయమై సమగ్ర నివేదిక అందివ్వాలని ఈవోఆర్‌డీ సోమరాజును డీపీవో ఆదేశించారు.

8 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు



కంటి ఆపరేషన్ చేయించుకున్న వారితో రోటరీ కంటి ఆస్పత్రి ప్రతినిధి రవిరామ్ జవహర్

అనకాపల్లి: స్థానిక గవరపాలెం ఏఎంఏఎల్‌ఎం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం ఎనిమిది మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసినట్లు రోటరీకంటిఆస్పత్రి ప్రతినిధి రవిరామ్ జవహర్ చెప్పారు. సోమవారం ఆస్పత్రి ఆవరణలో 46 మందికి కంటి పరీక్షలు చేసి, 8 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించినట్లు తెలిపారు. అన్ని పరీక్షల అనంతరం వారికి ఆపరేషన్లు చేసినట్లు ఐవోఎల్ కంటి ఆపరేషన్ వైద్యులు కె.మల్లేశ్వరరావు చెప్పారు. 5రోజులకు సరిపడ మందులు అందజేసినట్లు తెలిపారు. నేత్రవైద్యసహాయకురాలు పి.దేవి పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనలో ఆర్టీసీ విఫలం

అనకాపల్లి: ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో ప్రజారవాణాశాఖ(ఆర్టీసీ) విఫలమవుతోందని, ప్రయాణికుల నుంచి భారీగా చార్జీలు వసూలు చేయడమే తప్ప కనీస సదుపాయలు కల్పించడం లేదని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నయాదవ్ అన్నారు. ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీ డిపో సూపరింటెండెంట్ సూర్యారావుకు వినతిపత్రం అందజేశారు. అనకాపల్లి పట్టణం జీవీఎంసీ పరిధిలో విలీనమై ఎనిమిది సంవత్సరాలు అవుతున్నప్పటికీ అనకాపల్లి–లంకెలపాలెం సిటీ జనరల్‌పాస్‌లో వ్యత్యాసం చూపించడం తగదన్నారు. సిటీ జనరల్ బస్‌పాస్‌ను అనకాపల్లి వరకూ పొడిగించాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 73 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,560	5,150
రెండో రకం	--	--
మూడోరకం	3,600	3,600

అనకాపల్లి సినిమాలు

మల్లిమొగ్గలు	:రాజా
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-1
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-2
భారతీయుడు 2	:షిర్డిసాయి
భారతీయుడు 2	:పర్తిసాయి
మనమే	:వెంకటేశ్వర
తంత్ర	:శ్రీసత్య
సారంగదరియా	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 39 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్–2 యూనిట్లు, బి పాజిటివ్–19 యూనిట్లు, ఒ పాజిటివ్–16 యూనిట్లు, ఏబీ పాజిటివ్–2 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 349 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 298 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

వైభవంగా తిరుగు రథయాత్ర

- పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు



కల్కిఅవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన జగన్నాథస్వామి



రథాన్ని లాగుతున్న భక్తులు



ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించిన పట్టణ సీఐ శంకరరావు





కశింకోటలో జగన్నాథ స్వామికి పూజలు నిర్వహిస్తున్న శ్రీరామాచార్యులు, దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి: దేవదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో అనకాపల్లి పట్టణంలో మంగళవారం జగన్నాథ స్వామి తిరుగు రథయాత్ర వైభవంగా జరిగింది. స్థానిక గూడ్స్‌రోడ్డులోని ఇంద్రద్యుమ్నహాల్ నుంచి ఈ రథయాత్ర ప్రారంభమైంది. స్వామివారి రథాన్ని లాగేందుకు పెద్ద ఎత్తున భక్తులు పోటీ పడ్డారు. యువత రథాన్ని లాగుతూ డ్యాన్స్‌లు చేస్తూ, పాటలు పాడారు. గూడ్స్‌రోడ్డు నుంచి ప్రారంభమైన రథయాత్ర మళ్లవీధి, గాంధీబొమ్మ జంక్షన్, పెరుగుబజార్ జంక్షన్, మెయిన్‌రోడ్డు మీదుగా కన్యకాపరమేశ్వరి ఆలయం రహదారి, వేల్పులవీధి జంక్షన్, నెహ్రూచౌక్, శారదానది బ్రిడ్జి వరకూ వెళ్లి, తిరిగి పెరుగుబజార్ జంక్షన్‌కు అక్కడ నుంచి రింగ్‌రోడ్డు, గవరపాలెంలోని పలు ప్రాంతాల మీదుగా సాగి, అగ్రిమర్రిచెట్టు వద్ద జగన్నాథ స్వామి ఆలయానికి చేరుకుంది. అంతకుముందు నిర్వహించిన భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని పట్టణ సీఐ జి.శంకరరావు ప్రారంభించారు. రథోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమరశెట్టి రాంకీ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కల్కి అవతారంలో జగన్నాథస్వామి

స్థానిక గూడ్స్‌రోడ్డు ఇంద్రద్యుమ్నహాల్లో దేవదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగన్నాథస్వామి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు కల్కిఅవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఉచితంగా ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రాజసులోచన, ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, డైరెక్టర్లు బొండా రాజేష్, మోహన్‌రావు, వెంకట చలపతిరావు, వెంకటవీర అప్పారావు, కోటేశ్వరరావు, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం బుద్ధా అవతారంలో జగన్నాథ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, రేజేటి శ్రీరామచరణాచార్యులు, మారుతి పూజా కార్యక్రమాలు నిర్వహించి, ప్రసాద వితరణ చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు తిరుగు రథోత్సవం

జగన్నాథస్వామి ఉత్సవాల ముగింపులో భాగంగా బుధవారం సాయంత్రం స్వామి తిరుగు రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త శ్రీరామాచార్యులు తెలిపారు. జగన్నాథ స్వామి, బలభద్రస్వామి, సుభద్రల విగ్రహాలను గ్రామ వీధుల్లో రథంపై ఊరేగించనున్నట్లు తెలిపారు.

సందడిగా గోరింటాకు సంబరం



కళాశాలలో గోరింటాకు పెట్టుకుంటున్న విద్యార్థినులు



గోరింటాకు పెట్టుకున్న అరచేతులు చూపుతున్న విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు

యలమంచిలి రూరల్: ఆషాఢం..బాలికలకు..మహిళలకు ఎంతో ఇష్టమైన మాసం.వారి అరచేతులు ఎర్రని ముద్ద మందారాలయ్యే సమయం. సంస్కృతి, సంప్రదాయాల్లో భాగంగా మంగళవారం పట్టణంలో ఓ ప్రైవేటు కళాశాలలో గోరింటాకు సంబరాలను నిర్వహించారు. విద్యార్థినులు, అధ్యాపకులు అందరూ ఒక చోట చేరి చేతులకు గోరింటాకు పెట్టుకుని సందడి చేశారు. గోరింటాకు పెట్టుకోవడం వల్ల చేతులకు అందంతోపాటు, ఆరోగ్యకరమైన ప్రయోజనాలున్నాయని మహిళా అధ్యాపకులు విద్యార్థినులకు వివరించారు. విద్యార్థినులు, అధ్యాపకులు కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఎర్రగా అందంగా మారిన అరచేతులు చూపిస్తూ విద్యార్థినులంతా ఫొటోలు, సెల్ఫీలు తీసుకుని వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా స్నేహితులు, బంధువులకు పంపించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ఆషాఢమాసంలో గోరింటాకు పెట్టుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై విద్యార్థినులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.

నారుమడిలో జింకుధాతు లోపం నివారించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలోని దిమిలి, మురకాడ వ్యవసాయ క్షేత్రాల్లో మంగళవారం జిల్లా వనరుల కేంద్రంలో ఆధ్వర్యంలో ప్రకృతి సాగుపై అవగాహన కల్పించారు. గ్రామీణ విత్తనోత్పత్తి కింద మడి యాజమాన్యం గురించి వివరించారు. నారుమడిలో జింకు ధాతు లోపం నివారించాలని సూచించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ఎటువంటి మందులు పిచికారీ చేయాలో సూచించారు. జిల్లా వనరుల కేంద్రం ఏవో విజయ, ఏవో సుమతి, సాయి,సంతోషి కుమారి,రామారావు,మేఘన పాల్గొన్నారు.

వరి నారు సంరక్షణకు సూచనలు



గెడ్డపాలెంలో వరినారుమడులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



వాకపాడులో యంత్ర సామగ్రిని పరిశీలిస్తున్న ఏడీ ప్రభాకర్

ఎస్.రాయవరం : ప్రభుత్వం రాయితీతో సమకూరుస్తున్న వ్యవసాయ యంత్ర సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని యలమంచిలి సహాయ సంచాలకులు బి.ప్రభాకర్ తెలిపారు. వాకపాడు, గెడ్డపాలెం గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ బృందంతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ నాట్లుకు సిద్ధమవుతునన రైతులకు సూచనలు ఇచ్చారు. నారుమడులు సిద్ధం చేసుకునేందుకు 10 నుంచి 12 రోజుల ముందుగా దమ్ము మడులు సిద్ధం చేసుకోవాలన్నారు. దమ్ముల్లో అవసరమయిన మోతాదుల్లో భాస్వరం, పోటాషియం వంటి ఎరువులు జల్లుకోవాలన్నారు. నారుమడులు పురి విచ్చుకునే వరకు ఆరు తడులు ఇచ్చి తర్వాత పలుచగా నీరు నిలకట్టాలన్నారు. అనంతరం యంత్ర సేవా పథకం కింద పరికరాల వినియోగాన్ని పరిశీలించారు. లబ్ధి పొందిన రైతులు నుంచి సమాచారం తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో వ్యవసాయాధికారి సౌజన్య, ఏఈవో సూకరాజు తదితరులు ఉన్నారు.

19న ఐటీఐలో ఉద్యోగ మేళా

పాయకరావుపేట : పట్టణంలో గల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో ఈ నెల 19 వతేదీ ఉదయం 10 గంటలకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. ఐటీఐ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, వెల్డర్, కోప, డ్రాఫ్ట్‌మాన్ సివిల్ ట్రేడుల్లో పాసైన అభ్యర్థులు ఉద్యోగ మేళాలో పాల్గొనాలని సూచించారు. జె.వై. సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, టీసీఎస్ (హైదరాబాద్), టెక్ మహీంద్రా (చైన్నె), క్యూసీవ్ టెక్నాలజీస్(హైదరాబాద్) హాబేల్ బేల్లోస్ (దువ్వాడ, విశాఖపట్నం), ఆర్‌హెచ్‌ఐ మాగ్నెసిటా(పరవాడ), సాయి మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, యూ –2(గుడివాడ (5)) , యెన్.ఎస్.ముని స్పీడోమీటర్ మేనుఫ్యాక్చర్స్(శ్రీసిటీ), హెట్రో లాబ్స్ (నక్కపల్లి), వరుణ్ మోటార్స్(విశాఖపట్నం), లక్ష్మి మోటార్స్ (విశాఖపట్నం), కియా మోటార్స్ (విశాఖపట్నం)తదితర సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

31 వరకు లంపీస్కిన్ నివారణ టీకాలు

చీడికాడ: మండలంలో ఈ నెల 31వ తేదీ వరకు పశువులకు ముద్ద చర్మవాధి(లంపీస్కిన్) నిరోధక టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి కె.రాఘవమ్మ తెలిపారు. మంగళవారం ఆమె జి.కొత్తపల్లి, అర్జునగిరి, తురువోలుల్లో పశువైద్య శిబిరాలు పరిశీలించారు. పశువులకు ముద్దచర్మ వ్యాధి, జీవాల్లో వచ్చే నీలినాలుక వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ నెలాఖరు వరకు అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై నిఘా



తూటిపాలలో నిల్వ ఉన్న ఇసుకను పరిశీలిస్తున్న అధికారులు



అప్పన్నదొరపాలెంలో ఇసుక తవ్వకం ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మాకవరపాలెం: ఇసుక అక్రమ తవ్వకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తహసీల్దార్ మురళీమోహన్‌రావు తెలిపారు. మండలంలోని తూటిపాల, అప్పన్నదొరపాలెం, కొండలఅగ్రహారం, మాకవరపాలెం ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలను పోలీస్, పంచాయతీ రాజ్, మైన్స్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పరిధిలోని నదులు, గెడ్డలు, జిరాయితీ భూముల్లో ఇసుక తవ్వకాలు చేపట్టి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. తూటిపాలలో ఇసుక నిల్వలను పరిశీలించి, స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు పెడతామన్నారు. ఇసుక అక్రమ తరలింపు, తవ్వకాలపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఇదే విషయమై పోలీసులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులకు నిఘా ఉంచాలని ఆదేశాలిచ్చామన్నారు. ఎస్‌ఐ రామకృష్ణారావు, ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

శంకరంలో మెగా ప్లాంటేషన్ మేళా



మేళాను ప్రారంభిస్తున్న సర్పంచ్ రమేష్, ఎంహెచ్‌వో భాను పుష్పలీలావతి

మాడుగుల రూరల్: శంకరంలో మెగా ప్లాంటేషన్ మేళాను సర్పంచ్ శోలం రమేష్, మండల ఉద్యానవన శాఖాధికారి వి.భాను పుష్పలీలావతి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి సెప్టెంబరు 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఉద్యానవనశాఖ అందిస్తున్న పథకాలను వివరించారు. ఆయిల్‌పామ్ సాగుకు అందిస్తున్న రాయితీలను వివరించి, అంతర పంటలుగా కూరగాయలు, కోకో వేసుకోవడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చునని సూచించారు. ఆసక్తి కలిగిన రైతులు తమ సమీపంలో రైతు సేవా కేంద్రాల్లో వీఏఏ, వీహెచ్ఏలను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వీఏఏలు, వీహెచ్‌ఏలు, ఆయిల్‌పామ్ మేనేజర్ పి. శ్రీనివాస్, ఫీల్డ్ అధికారి విజయదుర్గ, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కశింకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

అనకాపల్లి: సీజనల్ వ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని గొల్లవీధి యూపీహెచ్‌సీ వైద్యాధికారి నాగేంద్ర తెలిపారు. డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులపై అవగాహన కల్పిస్తూ మంగళవారం స్థానిక గొల్లవీధి ఆస్పత్రి నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతుండడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువ ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. జర్వంతో బాధపడే వారు దగ్గరలో గల ప్రభుత్వ ఆస్పత్రుల్లో రక్తపరీక్షలు చేయించుకుని వైద్యుని సూచనలు మేరకు సకాలంలో మందులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మంగళవారం డయేరియా నిర్మూలన కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన వైద్యాధికారి తిరుపతిరావు మాట్లాడుతూ కాచి వడపోసిన నీటిని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిసరాల్లో మురుగు నీరు నిలవ లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయరాదన్నారు. కలుషిత ఆహార పదార్థాలను తినరాదని తెలిపారు. ఈవిషయాలపై ఆరోగ్య సిబ్బంది ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించి డయేరియా నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణరావు, ఏఎన్‌ఎంలు సత్యవతి, విజయలక్ష్మి, పారామెడికల్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్‌కాంప్లెక్స్ వద్ద పారిశుధ్య చర్యలు



బస్‌కాంప్లెక్స్ వద్ద చేపల అమ్మకాలను సిబ్బందితో నిలిపివేయిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు



చేపలు విక్రయించిన ప్రాంతంలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న మున్సిపల్ శానిటరీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

యలమంచిలి రూరల్ : యలమంచిలి బస్‌కాంప్లెక్స్ వద్ద చేపల అమ్మకాలకు బ్రేక్ పడింది. ఇక్కడ రోడ్డు పక్కనే విచ్చలవిడిగా చేపలు విక్రయిస్తుండడంతో ప్రయాణికులు, స్థానికులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా ఈ నెల 14న బస్‌కాంప్లెక్స్ వద్ద పారిశుధ్య లోపం పేరుతో సాక్షి దిన పత్రికలో కథనం ప్రచురితమైంది. ఇటీవల జరిగిన యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఈ సమస్యను వార్డు కౌన్సిలర్లు లేవనెత్తారు. దీంతో అక్కడ చేపల అమ్మకాలను నిలిపివేయాలని చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి ఆదేశించారు. అయినప్పటికీ బస్‌కాంప్లెక్స్ వద్ద చేపల అమ్మకాలు యథేచ్ఛగా కొనసాగుతున్న వైనంపై సాక్షిలో వార్త ప్రచురితం కావడంతో స్పందించిన ఇన్‌ఛార్జ్ మున్సిపల్ కమిషనర్ డి.ప్రభాకర్రావు చర్యలు తీసుకోవాల్సిందిగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావుకు సూచించారు. ఈ మేరకు మంగళవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ అక్కడకు వెళ్లి చేపల వ్యాపారులను అక్కడి నుంచి పంపించివేశారు. చేపలు విక్రయిస్తున్న ప్రదేశంలో బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రపరిచారు. మళ్లీ ఇక్కడ చేపలు విక్రయించడానికి ప్రయత్నిస్తే జరిమానా విధిస్తామని వ్యాపారులను హెచ్చరించారు.

శానిటేషన్‌పై దృష్టి సారించాలి

నక్కపల్లి : మండలంలో వివిధ గ్రామాల్లో నెలకొన్న శానిటేషన్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు మారిన నేపథ్యంలో గ్రామాల్లో డయేరియా, వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో కాలువల్లో పూడికతీత, క్లోరినేషన్ కార్యక్రమాలు నిర్వహించాని ఆదేశించారు. బావులు, రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చేయించాలని సూచించారు. సచివాలయాల్లో ఈ సర్వీసెస్ నిమిత్తం వసూలుచేసిన పెండింగ్ అమౌంట్స్ వెంటనే ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలన్నారు. పెన్షన్ల పంపిణీ పై సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. సచివాలయ సిబ్బంది క్రమం తప్పకుండా సచివాలయాలకు హాజరు కావాలని, హాజరు తప్పనిసరిగా బయోమెట్రిక్ ద్వారా తీసుకోవాలన్నారు. ఉపాధి పథకంలో కూలీ లకు 100 రోజుల పనికల్పించడం, మస్టర్ల తనిఖీలు, ఇంటిపన్నుల వసూళ్లు వంటి వాటిపై కూడా దృష్టిసారించాలన్నారు. పరిపాలనాధికారి సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై రైతుల దృష్టి



మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త రాజ్‌కుమార్

దేవరాపల్లి: చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త ఎస్. రాజ్‌కుమార్ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పెదనందిపల్లిలో చిరుధాన్యాల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. అధిక పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందన్నారు. ప్రస్తుతం ప్రజలంతా చిరుధాన్యాల వైపు మొగ్గు చూపడంతో మార్కెట్లో మంచి డిమాండ్ నెలకొందన్నారు. రాగులు, కొర్రలు, అండు కొర్రలు, తెల్ల జొన్న, పచ్చ జొన్నలు తదితర చిరుధాన్యాల విత్తనాలను రైతులకు అందజేశారు. వాటి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. అనంతరం శాస్త్రవేత్త సౌజన్య మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు తమవంతుగా తోడ్పాటు నందిస్తామన్నారు. కాయగూరల సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను మరో శాస్త్రవేత్త సత్తిబాబు సమగ్రంగా అవగాహన కల్పించారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు, రామచంద్రరావు, రైతులు పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీ రుణాలతో ఆర్థికాభివృద్ధి

కె.కోటపాడు: డ్వాక్రా సంఘాలకు అందించే బ్యాంకు లింకేజీ రుణాలతో ప్రతి సభ్యురాలు ఆర్థికాభివృద్ధిని సాధించాలని పెందుర్తి ఏరియా కోఆర్డినేటర్ రాజేశ్వరి తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీవోఏలతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి రుణాలను తీసుకోవడంతోపాటు వాటిని ప్రతి నెలా బ్యాంక్‌కు సకాలంలో వాయిదా పద్ధతిలో చెల్లించాలని సూచించారు. ప్రతి నెలా గ్రామ సంఘాల సమావేశం నిర్వహించడంతోపాటు రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. స్త్రీనిధి మేనేజర్ జగదీశ్వరి, ఏపీఎం పి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.